క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన స్కౌట్ విద్యార్థులు



కలెక్టర్‌ను కలిసిన స్కౌట్ విద్యార్థులు

నల్లగొండ : పట్టణంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ సందర్భంగా గురువారం స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు సురేష్‌గుప్త, కరుణాకర్, స్వామిదాస్, విమల, రాజు, ఎస్‌టీ ఆల్ఫెన్స్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఈ బాలస్వామిని కలిసిన 1104 ఉద్యోగులు



సీఈకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

నల్లగొండ : పట్టణానికి వచ్చిన టీజీఎస్ పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామిని గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు పి.రాంబాబు, సంయుక్త కార్యదర్శి ఎండీ.అయూబ్, ప్రచార కార్యదర్శి పివి.నాయక్, నాయకులు బి.ముత్తయ్య, ఎంఏ ఫర్వేజ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కథల పోటీలకు శిరీష ఎంపిక



చిట్యాల : తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీలకు మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదువుతున్న కంకల శిరీష రాసిన ×మార్పు× కథ రచన ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాసారం శ్రీనువాసులు, తెలుగు ఉపాధ్యాయురాలు ఉప్పల పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరగనున్న బాలల సాంస్కృతికోత్సవ కార్యక్రమంలో శిరీషకు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేయనున్నారు.

ఆర్టీసీలో యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలి

నల్లగొండ టౌన్ : ఆర్టీసీలో యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. గురువారం పట్టణంలో రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ అధ్యక్షతన ఆర్టీసీ స్టాఫ్-వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, వి.లక్ష్మయ్య, జి.రమేష్, బొడ స్వామి, నరసింహయ్య, కృష్ణయ్య, పిచ్చయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆదర్శ రైతుల కమిటీ ఎన్నిక

కట్టంగూర్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ఆదర్శ రైతుల సంఘం సమావేశాన్ని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు దొంతూరి శంకరయ్య, జిల్లా కార్యదర్శి బట్టు భిక్షం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదర్శ రైతుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండమళ్ల అంతయ్య, ఉపాధ్యక్షుడిగా కుంభం విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెద్ది వెంకన్న, కార్యదర్శిగా ఎర్కల సైదులు, కోశాధికారిగా బెజవాడ రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఊట్కూరి యాదయ్య, రాంబాబు, మాద సైదులు, నర్సింహ, యాదయ్య, పొన్న అంజయ్య, ముఖ్య సలహాదారుడిగా రేకల భిక్షం, కుందారపు నర్సిరెడ్డి ఎన్నికయ్యారు.

కేతేపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఆదర్శ రైతుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు దంతూరి శంకరయ్య, జిల్లా కార్యదర్శి బట్టు భిక్షమయ్య ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గం అంజయ్య, ఉపాధ్యక్షుడిగా మోదుగు సైదిరెడ్డి, కార్యదర్శిగా ఆకవరం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎడవెల్లి శ్రీను, సహాయ కార్యదర్శిగా అలుగుబెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా దండెంపల్లి జానయ్య, క్రిష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

నేత్రదానం

నకిరేకల్ : పట్టణానికి చెందిన వ్యాపారి కోటగిరి మురళి (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో అతడి నేత్రాలను కుటుంబీకులు నల్లగొండ నేత్ర ఆస్పత్రికి దానం చేశారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సకినాల రవి, బ్రహ్మదేవర రమేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోటగిరి రమేష్, కోటగిరి శ్రీను, శివకోటి అంజనేయులు, రాంమోహన్‌రావు ఉన్నారు.

ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు

- పత్తి అమ్ముకునేందుకు సీసీఐకి భారీగా వస్తున్న రైతులు
- చండూరు మార్కెట్ పరిధిలో నాలుగు మిల్లుల్లో కొనుగోలు
- కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని వేడుకోలు



మునుగోడులోని సీసీఐ కేంద్రానికి పత్తిలోడ్‌తో క్యూకట్టిన ట్రాక్టర్లు

మునుగోడు : ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సీసీఐ కేంద్రాలలో ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు సాగుతున్నాయి. 20రోజుల క్రితం మునుగోడు జిన్నింగ్ మిల్లులో ప్రారంభించినా ఈనెల 3వరకు ఏ ఒక్క రైతు వద్ద క్వింటా పత్తి కొనుగోలు చేయలేదు. దీంతో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు సీసీఐ కేంద్రాలను పరిశీలించి సంబంధిత అధికారులకు కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. అయినా ప్రారంభించకపోవడంతో ఈనెల 1న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ, మార్కెట్ అధికారులతో పాటు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్‌తో పాటు సీసీఐ అధికారులకు రైతుల ఇబ్బందులను ఫోన్‌లో వివరించారు. దీంతో ఈనెల 4నుంచి సీసీఐలో కొనుగోళ్లు ప్రారంభించారు.

55,971క్వింటాళ్ల పత్తి కొనుగోలు..

చండూరు మార్కెట్ పరిధిలో మొత్తం నాలుగు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. అందులో మునుగోడు మండలంలో మూడు, చండూరు మండలంలో ఒకటి ఉంది. అయితే సీసీఐ అధికారులు ఈనెల 4న పత్తి కొనుగోళ్లు ప్రారంభించగా ఇప్పటి వరకు మార్కెట్ పరిధిలోని నాలుగు మిల్లుల్లో 229మంది రైతుల నుంచి 55,971క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్ల విషయాన్ని తెలుసుకున్న మునుగోడు పరిసర ప్రాంతాల రైతులు తమ పత్తిని అమ్ముకునేందుకు జిన్నింగ్ మిల్లుల వద్దకు తమ పత్తిని ట్రాక్టర్లలో లోడు చేసుకొని మిల్లుల వద్ద బారులుదీరారు. దీంతో ఒక్కో మిల్లు వద్ద దాదాపు 200నుంచి 300 ట్రాక్టర్లతో రైతులు క్యూకట్టారు. ఆలస్యమైనా సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతన్నలు, రైతు సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పత్తి అమ్ముకునేందుకు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సివస్తుండడంతో కేంద్రాల వద్ద నీడ, నీటి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిల్లులు గ్రామానికి దూరంలో ఉండడంతో నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అంతే కాకుండా ఎక్కడా నీడ సౌకర్యం లేకపోవడంతో రోడ్ల వెంట ఉన్న చెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రధాన రహదారిలో ఒక వైపు రైతుల ట్రాక్టర్లు, మరో వైపు రైతులు సేద తీరుతుండడంతో వాహనదారులు వేగంగా వస్తే ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల పత్తిరైతులు కోరుతున్నారు.

సీసీఐ ఏర్పాటు హర్షణీయం



నేను 8ఎకరాలలో పత్తి సాగు చేయగా మొదటి దఫా 40క్వింటాల దిగుబడి వచ్చింది. అయితే అందులో మొదట ప్రైవేట్ వ్యాపారులకు 10క్వింటాలు అమ్ముకుంటే క్వింటాకు రూ.6200లే ఇచ్చారు. దీంతో మిగిలిన 2క్వింటాలు అలాగే ఉంచి సీసీఐకి అమ్ముకునేందుకు వచ్చాను. ఈరోజు సీసీఐలో అమ్ముకుంటే క్వింటాల్‌కు రూ.7300 ధర వేశారు. సీసీఐ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

– కర్నాటి నర్సింహ, రైతు, జక్కలవారిగూడెం

కాంగ్రెస్ సేవాదళ్‌ను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముంఖాల దాస్

నల్లగొండ : బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ సేవాదళ్‌ను బలోపేతం చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ ముంఖాల దాసు అన్నారు. గురువారం పట్టణంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సేవాదళ్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రధాన మలుపుకు నాంది పలికిందన్నారు. ఈనెల 20న గాంధీభవన్‌లో జరిగే సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టేట్ సెక్రటరీ గండూరి నర్సింహ, సూర్యాపేట జిల్లా సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు శకుంతల, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, జనరల్ సెక్రటరీ ఆరిఫ్, అవంచల వెంకటేష్, మిర్యాలగూడ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ప్రమీల, మిర్యాలగూడ మండల అధ్యక్షుడు ఆకుల పరమేశ్వరి, మునుగోడు నియోజకవర్గ సేవాదళ్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



సరంపేట కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

మర్రిగూడ : పత్తిలో అధిక తేమ ఉందనే సాకుతో పత్తిమిల్లుల యాజమాన్యం, సీసీఐ అధికారులు కొనుగోళ్లు నిలిపి వేశారని, కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని మండల రైతులు గురువారం పత్తి మిల్లుల వద్ద ఆందోళన చేపట్టారు. మండలంలోని శ్రీలక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ యరగండ్లపల్లి, హరిహర కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్ సరంపేట గ్రామాల్లో నాలుగు రోజులు క్రితం అధికారులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి మూడు రోజులు కొనుగోలు చేశారు. గురువారం ప్రభుత్వ మద్దతు ధర లభించాలంటే 8నుంచి 12శాతం మాత్రమే తేమ ఉండాలని నిబంధనలను పెట్టడంతో రైతులు రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దళారుల వాహనాలకు అనుమతి ఇచ్చి అసలైన రైతుల వాహనాలకు నిబంధనలను పెడుతున్నారని రైతులు వాపోయారు. తేమశాతం తెలిపే పరికరంలో కూడా లోపాలు ఉన్నాయని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎస్ఐ కె.రంగారెడ్డిలు ధర్నా వద్దకు చేరుకొని సీసీఐ అధికారులు, మిల్లుల యాజమాన్యాలతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అనంతరం పత్తి తేమ శాతం ప్రకారం కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి



నల్లగొండ రూరల్ : అన్నెపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నల్లగొండ రూరల్ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నెపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ధాన్యం ఎగుమతి, కొనుగోలు రికార్డును పరిశీలించారు. ఏవైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

నల్లగొండ రూరల్ : మండలంలోని అప్పాజిపేటలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు గురువారం కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు సత్యనారాయణ మాట్లాడారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పందుల భిక్షం, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అచ్చాలు, యాదమ్మ, సునీత, పార్వతమ్మ, వెంకటమ్మ, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు..

వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

నార్కట్‌పల్లి : సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసి డిసెంబర్ 26నాటికి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ వీరోచితమైన పాత్ర వహించిందన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, గొని లక్ష్మీనర్సయ్య, వెంపటి శ్రీనివాస్, వంగాల నాగయ్య, జిల్లా సత్యం, సంగిశెట్టి శ్రీనివాస్, పులసాని అనంతరెడ్డి, తీగల పిచ్చిరెడ్డి, మల్లేష్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు సంఘీభావంగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడికి రావాల్సిన రూ.40వేల ఏరియర్స్ బకాయిలను వారి ఖాతాలో జమచేయాలని, రెండు సంవత్సరాలుగా ఇవ్వాల్సిన బట్టలు, నూనె, టవల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనలు అమలు చేసి, వారికి పదోన్నతలు కల్పించాలన్నారు. ఈ దీక్షలకు సీపీఎం, టీడీపీ నాయకులు సయ్యద్‌హాషం, ఎల్వీ యాదవ్, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎండీ.సలీం, కార్మికులు వెంకటేశం, సావిత్రి, యాదయ్య, రమణమ్మ, మల్లమ్మ, కాశయ్య పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు తగదు




సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిట్యాల : మూసీ సుందరీకరణకు కృషిచేస్తున్న భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని స్థానిక మున్సిపల్ చైర్మన్ కోమటి రెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని, పత్తి పంటలను సకాలంలో కొనుగోలు చేసేందుకుగాను ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వలిగొండ మండలంలోని సంగెంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వనమా వెంకటేశ్వర్లు, ఎద్దులపురి కృష్ణ, బట్టు అయిలేష్, అంతటి వెంకటేష్‌గౌడ్, జనగాం రవీందర్‌గౌడ్, అద్దెల లింగారెడ్డి, బెల్లి సత్తయ్య, రెముడాల మధు, చెర్కుపల్లి శ్రీశైలం, బొబ్బల రాంరెడ్డి, జంపాల వెంకన్న ఉన్నారు.

ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలి : డీఎంహెచ్‌ఓ

నల్లగొండ టౌన్: ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం నల్లగొండలోని టీఎన్‌జీవో భవన్‌లో జరిగిన నల్లగొండ డివిజన్ స్థాయి ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల్లో ఆశా వర్కర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ సమావేశంలోలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, పీఓడీటీటీ డాక్టర్ కృష్ణకుమారి, డీటీసీఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డీఐఓ డాక్టర్ పద్మ, డీఎంఓ ఆర్.దుర్గయ్య, వెంకట్‌రెడ్డి, శాంతకుమారి, వెంకటేశ్వర్లు, అనీష్, మహేశ్వరి పాల్గొన్నారు.

గ్లోబల్ టెండర్లు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

నల్లగొండ: గ్లోబల్ టెండర్ల విధానం రద్దు చేయాలని నల్లగొండ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గ్లోబల్ టెండర్ల విధానాన్ని ఖండిస్తూ గురువారం నల్లగొండలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట పలువురు కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ బాలస్వామి వినతి పత్రం అందజేశారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- చండూరు ఆర్డీఓ శ్రీదేవి



చండూరు(గట్టుప్పల్) : గట్టుపల్‌లో సర్వేను పరిశీలిస్తున్న చండూరు ఆర్డీఓ శ్రీదేవి



నల్లగొండ రూరల్ : సర్వేను పరిశీలిస్తున్న నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి

చండూరు(గట్టుప్పల్) : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి ఎన్యుమరేటర్లకు సూచించారు. గురువారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆమె సర్వేను పరిశీలించారు. 9తేదీ వరకు ఇళ్లకు స్టిక్కర్లువేయాలన్నారు. 9నుంచి 18వతేదీ వరకు సర్వే కొనసాగించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రాములు, మండల విద్యాధికారి అమతాదేవి, కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి

నల్లగొండ రూరల్ : ప్రభుత్వ నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంచనపల్లి, బుద్దారం, అన్నెపర్తి గ్రామాల్లో చేపడుతున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న వివరాలు, నమోదును పరిశీలించారు. ఇంట్లో ఎవరూ లేకపోతే మరోసారి ఇంటికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఇతరులు చెప్పిన సమాచారం నమోదు చేయవద్దన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కనగల్ : ఇంటింటి సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బి.పద్మ కోరారు. గురువారం అమ్మగూడెం, కుమ్మరిగూడెం, కనగల్ గ్రామాల్లో నిర్వహించే సర్వేలో ఆమె పాల్గొని ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఆమె వెంట డీటీ పార్వతమ్మ, ఏఆర్ఐ యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కల్మెర గ్రామంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే కోసం అతికించిన స్టిక్కర్లను, వాటిపై నమోదు చేసిన ఇంటి నంబర్, ఎన్యుమరేషన్ బ్లాక్ తదితర వివరాలను తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఆర్ఐ కుమార్‌రెడ్డి ఉన్నారు.

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు సర్వే నిర్వహించారు. మండలంలోని తమ్మడపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, దామెరబీమనపల్లిలో ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ సర్వేను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం, లెంకలపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం



జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్‌లో ఆదిలాబాద్‌తో జరిగిన పోటీలో 2–1 గోల్స్ తేడాతో ద్వితీయ స్థానం పొందింది. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు నల్లగొండ నుంచి ముగ్గురు క్రీడాకారులు విగ్నేష్, మహమ్మద్ మాజ్, వినయ్ ఎంపికయ్యారు. వారి ఎంపిక పట్ల స్కూల్ గేమ్స్ సెక్రటరీ దగ్గుపాటి విమల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కోచ్ మేనేజర్లుగా వ్యవహరించిన ఎండీ యావర్, ఇమామ్‌కరీంలను అభినందించారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, బహిరంగ ప్రదేశాలతో పాటు అనుమానిత కాలనీల్లో యాంటి నార్కొటిక్ స్నిఫ్పర్ డాగ్‌తో తనిఖీలు చేశారు. 29 మందిపై పెట్టీ కేసులు, 16 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 14 వాహనాలను సీజ్ చేశారు. లాడ్జీల్లో ఉంటున్న వారి ఆధార్, పాన్‌కార్డులు తనిఖీ చేశారు. సమస్యాత్మక కాలనీల్లో సోదాలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, సైదులు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చండూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారం నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖాళీ ప్లేట్లతో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోగా భోజన బిల్లులు తన అకౌంట్ వేసుకుంటున్న సంబంధిత హెచ్‌ఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలతో అన్నం వండిస్తున్న హెచ్‌ఎంపై తగిన విచారణ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు స్పందన, ప్రణవి, నవదీప్, కిరణ్, మున్నా, జోసెఫ్, వంశీ పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిరావాలి

కేతేపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 8న చేపట్టే మూసీ పునరుజ్జీవన పాదయాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళన చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉంటే గత పాలకులు అబద్దాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్రకు ప్రజలు సంఘీభావం తెలిసి విజయవంతం చేయాలని అన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు దర్వేశిపురం ఆలయం వద్ద వేలం పాట

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీరేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద 2025–2026 గాను కొబ్బరి కాయలు, లడ్డు, పులిహోర, గాజులు, కిరాణం, మిఠాయి విక్రయాలు, ఫొటోలు తీయడానికి ఆలయం వద్ద నేడు ఉదయం 11గంటలకు టెండర్‌కం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు నాగర్జున గ్రామీణ బ్యాంకు నల్లగొండ బ్రాంచ్‌లో చెల్లుబాటు అయ్యేవిధంగా ఎల్లమ్మ దేవస్థానం దర్వేశిపురం పేరున డీడీ తీసి దేవస్థానం కార్యాలయం వద్ద అందజేయాలని తెలిపారు.

విశ్వబ్రాహ్మణగా నమోదు చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ) : కులగణన సర్వేలో కమ్మరం, వడ్రంగం, కంచరం, శిలాశిల్పి, స్వర్ణకార వృత్తుల వారు తమ కులం పేరు విశ్వబ్రాహ్మణగా నమోదు చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణమాచారి కోరారు. గురువారం పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

టెట్ అర్హత మార్కులు సమానంగా ఉండాలి

నల్లగొండ : టెట్ అర్హత మార్కులు అందరికి సమానంగా ఉండాలని ఓసీ విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేడిపల్లి సునంద, కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. టెట్‌లో జనరల్ కేటగిరి అభ్యర్థులకు అర్హత మార్కులు 90అని నిర్ణయించడంతో చాలా మంది అర్హత పొందలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం అందరికి సమానంగా ఉండే నిబంధన ఉంచాలని కోరారు.

9న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మర్రిగూడ : మండల కేంద్రంలోని భారతీ గార్డెన్స్‌లో ఈనెల 9న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జనరల్ సెక్రటరీ వినీల్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిగల రైతులకు 40కిలోల సేంద్రియ ఎరువుల బస్తాను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రధానమంత్రి అవార్డు పొందిన ట్రైనర్లు మల్లిఖార్జునరెడ్డి, బైరి నరేష్‌రెడ్డి, ఇందిరా, ప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

కంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

శాలిగౌరారం : మండల కేంద్రం పరిధిలోని మార్కెట్‌కాలనీ, బాలెశెట్టిగూడెం, పావురాలగూడెం గ్రామాలకు సంబంధించిన కంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా కంఠమహేశ్వర ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని జయప్రదం చేయాలి

నల్లగొండ : చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి బొల్గూరి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బొంగరాల నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరవీరులను స్మరిస్తూ ఈనెల 1నుంచి 9వరకు అమరవీరుల సంస్మరణ సభలు జరపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను ఆలేరు పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు అనిల్‌కుమార్, వర్కటపు సైదులు, నవీన్, నల్పరాజు యాదయ్య, అంజిబాబు, రంగక్క తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని 8వవార్డుకు చెందిన మున్సిపల్ కార్మికుడు బొమ్మకంటి భిక్షమయ్య విధులో భాగంగా ఇటీవల గుంతలో పడి మృతి చెందాడు. గురువారం అతడి కుటుంబానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న తన వంతుగా రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మంచుకొండ కీర్తిసంజయ్, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, సంగెపు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డులో చిరు వ్యాపారం చేసుకుంటున్న పేద కుటుంబం తాటి గీతసైదులు దంపతులకు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావిరాల అశోక్ చొరవతో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, హైదరాబాద్ రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము సహకారంతో రూ.15వేల విలువ చేసే తోపుడు బండిని బహూకరించారు.